వాగులు ఉప్పొంగాయి..

- పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు, సుద్దవాగు
- పలు గ్రామాలు, మండలాలకు నిలిచిన రాకపోకలు
- స్తంభించిన జనజీవనం
- ప్రమాదం అని తెలిసినా తప్పని ప్రయాణం



శివపురం పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఎక్కడి ప్రజలు అక్కడే నిలిచిపోయిన దృశ్యం



ప్రమాదం అని తెలిసినా వాగును దాటుతున్న ఆటో

కొత్తపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. నల్లమలలో భారీ నుంచి అతి భారీవర్షాలు కురవడంతో శివపురం సమీపంలోని పెద్దవాగు, దుద్యాల గ్రామశివారులో ఉన్న సుద్దవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని 20గ్రామాలకు, ఆత్మకూరు, పాములపాడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దవాగు ఉధృతితో శివపురం, చిన్నగుమ్మడాపురం, సింగరాజుపల్లి, పెద్దగుమ్మడాపురం, బట్వారిపల్లి, మునలిమడుగు, ఎర్రమఠం, శ్రీమాడుగుల, జానాలగూడెం గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. అత్యవపర పరిస్థితుల్లో కొంతమంది ప్రమాదమని తెలిసినా పొంగిపొర్లుతున్న వాగులను దాటుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఒకరినొకరు పట్టుకుని వాగును దాటుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు, రెవెన్యూశాఖల సహకారం తీసుకోవాలని కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. ఏదీ ఏమైనా ఈ గ్రామాల పరిధిలో హైలెవెల్ వంతెన నిర్మిస్తే తప్ప కొత్తపల్లి మండల ప్రజల ఇబ్బందులు తప్పవు.



ఆత్మకూరు శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నది

శాంతించని 'భవనాశి'

ఆత్మకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఆత్మకూరు శివారులో ప్రవహిస్తున్న భవనాశి నది రెండో రోజైన గురువారం ఉగ్రరూపం దాల్చింది. నల్లమలలో కురిసిన భారీ వర్షాలతో వరద రాజస్వామి ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చిచేరుతోంది. ప్రాజెక్టులోకి గరిష్ఠ స్థాయిలో నీటిచేరిక ఉండటంతో ప్రాజెక్ట్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షపునీటిని ఎప్పటికప్పుడు మునిమడుగుల వాగుకు విడుదల చేస్తున్నారు. దీంతో ఈ నీరు భవనాశి నదిలోకి చేరి ఆత్మకూరు శివారు మీదుగా సంగమేశ్వరానికి చేరుకుంటుంది. ఈక్రమంలోనే ఆత్మకూరు శివారులోని కురుకుంద, కొత్తపల్లి మలుపువద్ద ఉన్న వంతెనపై భవనాశి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. మండలంలోని కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. భవనాశి సమీపంలోనే ఉన్న పడేవాగులో కూడా నీటి ఉధృతి కొనసాగింది. ఆయా వాగుల సమీపంలో ఉండే పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వడ్లరామాపురం రస్తాలో ఉన్న పీతురువాగు కూడా ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వడ్లరామాపురం రస్తాలోని భవనాశి నదీ పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు కూడా నీటమునగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- అత్యధికంగా కొత్తపల్లెలో 40.6 మి.మీ వర్షపాతం
- అత్యల్పంగా చాగలమర్రిలో 2.2 మి.మీ..

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పలు మండలాల్లో గురువారం విస్తారంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా కొత్తపల్లె మండలంలో 40.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బండిఆత్మకూరు 34.0, శ్రీశైలం 29.2, ఆత్మకూరు 23.6, పగిడ్యాల 22.8, నంద్యాల పట్టణం 15.6, నందికొట్కూరు 15.2, మహానంది 14.2, వెలుగోడు 12.4, ఆళ్లగడ్డ 12.4, మిడ్తూరు 12.0, పాములపాడు 11.4, రుద్రవరం 10.6, బనగానపల్లె 10.4, శిరువెళ్ల 10.2, పాణ్యం 10.2, కోవెలకుంట్ల 10.0, జూపాడు బంగ్లా 9.6, దొర్నిపాడు 9.6, గోస్పాడు 9.2, బేతంచెర్ల 9.0, నంద్యాల మండలం 8.4, సంజామల 8.2, ప్యాపిలి 8.2, అవుకు 7.4, ఉయ్యాలవాడ 6.6, డోన్ 5.6, కొలిమిగుండ్ల 5.6, చాగలమర్రి 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది జిల్లావ్యాప్తంగా 402.6 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది.

ఘాటు తగ్గిన పచ్చిమిర్చి

- 50 కిలోల బస్తా రూ.1,300
- ఆందోళనలో రైతన్నలు



రుద్రవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పచ్చిమిర్చి ఘాటు తగ్గింది. 50 కేజీల బస్తాల రూ.2900 నుంచి రూ.1300కు పడిపోయింది. గురువారం 50 కేజీల బస్తాల రూ.1300 పలకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 600 ఎకరాలు పైబడి పచ్చిమిర్చి రైతులు సాగుచేశారు. ఒక్కసారిగా బస్తాపై రూ.1600 తగ్గిపోయిందని రైతులు వాపోయారు.

'పంద్రాగస్టు'కు సర్వం సిద్ధం

- నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు
- హాజరుకానున్న రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈవేడుకలకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. సాయుధ దళాల కవాతు, ప్రభుత్వ విభాగాల శకట ప్రదర్శన, బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల స్టాల్స్, అవార్డులు, ప్రశంసాపత్రాల ప్రదానం వంటి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. దేశభక్తిని పెంపొందించేలా, మన సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలను నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ఈ వేడుకల్లో జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.



స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం

ఇకపై పర్మిట్ రూమ్‌లు

ఏడాదికి రూ.7 కోట్ల ఆదాయం



నంద్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మద్యం చాటున జరిగే పలు రకాల విమర్శలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు లైసెన్స్‌లు మంజూరు చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం దుకాణాలకు వార్షిక లైసెన్సు పేరుతో ఫీజులు పెట్టి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా 115 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ నూతన విధానంతో ప్రభుత్వానికి నంద్యాల జిల్లాలో ఏడాదికి రూ.7కోట్ల మేర ఆదాయం సమకూరనుంది.

షరుతులు వర్తించును..!

నూతన పాలసీ అమలైతే ఎలాంటి విమర్శలకు తావులేకుండా ప్రభుత్వం వివిధ షరతులతో పర్మిట్ రూమ్‌లకు అనుమతి కల్పించింది. ప్రధానంగా ప్రతి మద్యం దుకాణల వద్ద ఏడాదికి ఒకసారిగా పర్మిట్ లైసెన్సు ఉత్తర్వులు ప్రకారం రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. పర్మిట్ రూమ్ ప్లింత్ ఏరియా కూడా వెయ్యి చదరపు అడుగులకు మించి ఉండరాదు. పైగా మద్యం దుకాణాల ప్రాంగణంలోనే పర్మిట్ రూమ్ ఉండాలి. రూ.55 లక్షలు వార్షిక లైసెన్సు ఫీజు చెల్లించే (రిటైల్ ఎక్సైజ్ టాక్స్) మద్యం దుకాణాలు పర్మిట్ రూమ్ లైసెన్సు కోసం ఏడాదికి రూ.5 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంది. అదే రూ.65-85 లక్షలు చెల్లించే మద్యం దుకాణాల వ్యాపారులు పర్మిట్ రూమ్ లైసెన్సు కోసం ఏడాదికి రూ.7.50 లక్షలు చెల్లించాలి. పైగా ఈ మొత్తాన్ని ఒకే విడతలోనే చెల్లించాలనే నిబంధన పెట్టారు. ఆ దిశగా ఆయా దుకాణా దారులు ఈ ఏడాది నవంబరు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం కట్టడికి చర్యలు



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం పర్మిట్ రూమ్‌లకు అనుమతి కల్పించింది. అయితే పర్మిట్ రూమ్‌ల నిబంధనలను మద్యం వ్యాపారులు పక్కాగా పాటించాలి. అనధికారికంగా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్



నకిలీ లేఖల బాగోతం బట్టబయలు

- ప్రజాప్రతినిధుల పేర్లతో నకిలీ లెటర్లు తయారీ
- టీటీడీ దర్శనం, ఉద్యోగుల బదిలీలకు అమ్మకాలు
- ఫిర్యాదు చేసిన ఎంపీ పీఏ
- పోలీసులు అదుపులో నిందితుడు



నిందితుడిని విచారిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): నకిలీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా ప్రజాప్రతినిధుల పేర్లతో లేఖలు సృష్టించాడు ఓ కేటుగాడు. తిరుపతిలో అతని లేఖ ద్వారా మోసపోయిన బాధితులు నంద్యాల ఎంపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అతడి బాగోతం బట్టబయలు అయ్యింది. ఎంపీ పీఏ పోలీసులకు సమాచారమిచ్చినట్లు నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. వెలుగోడు మండలం గుంతకందనాలకి చెందిన వెంకటేశ్వర్లు అనే యువకుడు నంద్యాలలోని బైర్మల్ వీధిలోని ఒక గదిని అద్దెకు తీసుకున్నాడు. అక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీల లెటర్లు పోలి ఉండేలా నకిలీలెటర్లు తయారుచేసి సన్నిహితుల ద్వారా అమ్ముకుంటున్నాడు. నెల్లూరుకు చెందిన చంద్రకళ అనే మహిళకు బుధవారం టీటీడీ దర్శనం కోసం నంద్యాల ఎంపీ లెటర్‌ను నకిలీ తయారు చేసి అమ్మాడు. వారు తిరుపతి వెళ్లగా అక్కడ ఇది నకిలీ లెటర్ అని తేలింది. ఆమె నంద్యాలలోని ఎంపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎంపీ పీఏ బైరెడ్డి దినేశ్‌రెడ్డి గురువారం పోలీసులకు సమాచారమివ్వగా నిందితుడిని పట్టుకున్నారు. వెంకటేశ్వర్లు అన్న రమణ స్నేహితుడు రవితేజ ద్వారా నెల్లూరు వ్యక్తులకు నకిలీ లెటర్లు ఇచ్చాడు. అద్దెకు తీసుకున్న గదిలో, సొంతూరు గుంతకందనాల గ్రామంలో కూడా పోలీసులు సోదాలు చేశారు. ఎంపీ పీఏ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గాంధేయవాది ఆర్‌కేరామ్

- మహాత్ముడికి సేవలందించిన శిష్యుడు
- సంఘ సంస్కర్తగా, ప్రజాసేవకుడిగా ప్రత్యేక గుర్తింపు



చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆ రోజుల్లో బాపూజీ (మహాత్మాగాంధీ)ను చూడటం ఒక గొప్ప అనుభవం. ఆయనతో మాట్లాడటం ఆనందంగా భావించేవారు. అలాంటి మహాత్ముడికి సేవలందించిన తెలుగు వ్యక్తి ఆర్‌కే రామ్. ఆయనది నంద్యాల జిల్లాలోని చాగలమర్రి. బాల్యంలోనే మహాత్ముడి శాంతియుత పోరాటల గురించి విని, చదివి ప్రభావితులయ్యారు. మనసులో గాంధీ ఆలోచనలు నాటుకుపోయాయి. మహాత్ముడిని కలుసుకోవాలని ఇళ్లు విడిచి వెళ్లిపోయారు. నానా కష్టాలు పడి మహాత్ముడి సేవాగ్రామ్ చేరుకున్నారు. అక్కడ ఉంటూ గాంధీతో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ ఆయనను నిత్యం సేవిస్తూ ఆనందించారు. బాపూజీ నవకాశీయాత్ర చేసినప్పుడు ఆయన వెంట ఉన్న ఏకైక తెలుగువాడు రామ్ మాత్రమే. మహాత్ముడు మరణానంతరం చితాభస్మాన్ని ప్రత్యేక రైలులో దేశంలోని ప్రముఖ ప్రదేశాలకంతా తీసుకెళ్లిన బృందంలో రామ్ ఉన్నాడు.

రామలింగారెడ్డి నుంచి రామ్‌గా...

ఆర్‌కేరామ్ పూర్తి పేరు ఆర్‌కే రామలింగారెడ్డి. ఈయన 1922 మే మాసంలో చాగలమర్రిలో జన్మించారు. తల్లిదండ్రులు కొండారెడ్డి, పుల్లమ్మ. తండ్రి కొండారెడ్డికి ఆధ్యాత్మిక, ధార్మిక చింతన బాగా ఉండేది. ఆయన గ్రామంలోని ఆలయానికి వెళ్లి నిత్యం పూజలు చేసే వారు. అలా రామ్‌కూడా తండ్రి వెంట దేవాలయానికి వెళ్లేవాడు. అప్పట్లో కుల వ్యవస్థ బలంగా ఉండేది. దీన్ని వ్యతిరేకిస్తూ రామ్ తన పేరు చివరిలోని కులాన్ని వదిలేసి ఆర్‌కే రామ్‌గా పేరు మార్చుకున్నారు. అనంతలక్ష్మిని కులాంతర వివాహం చేసుకున్నారు. రామ్‌లాగే ఆయన భార్య అనంతలక్ష్మి కూడా ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారు.

ప్రజాసేవలో..

స్వాతంత్ర్యం అనంతరం 1947లో ఆర్‌కే రామ్‌ను ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకొని సముచిత గౌరవమిచ్చారు. 1952-53లో సర్వోదయ భూదాన ఉద్యమానికి ఉపసంచాలకులుగా ఆయన వ్యవహరించారు. 1955లో వినోభ బావే ఆంధ్రప్రాంతంలో జరిపిన పర్యటనకు రామ్ నాయకత్వం వహించారు. 1960లో ఇజ్రాయిల్ దేశపర్యటన జరిపి అక్కడ గోల్డామేర్‌ను కలిశారు. మహిళా చైతన్యం కోసం, అవిటి వారికి విద్యాబోధన కోసం ఎంతో కృషి చేశారు. వయోజన విద్య కార్యక్రమాలను అమలు చేశారు. రామ్ 1950లో ఆంధ్రవిశ్వవిద్యాలయానికి సెనెట్ సభ్యుడిగా, ఖాదీ గ్రామోద్యోగ బోర్డుకు 1962 నుంచి 1965 వరకు అధ్యక్షుడిగా పని చేశారు. భూదాన్ అనే పత్రికకు సంపాదకుడిగా పనిచేశారు. చాగలమర్రికి బాలికల పాఠశాల, వైద్యశాల, కళాశాల రావడం కోసం శ్రమించారు. 1985 డిసెంబరు 3న తన స్వగ్రామం చాగలమర్రిలో ఆర్‌కేరామ్ తుదిశ్వాస విడిచారు. బాపూజీ ప్రియ శిష్యుడిగా, ప్రజాసేవకుడిగా, సంఘ సంస్కర్తగా ఆయన జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు.

406 మంది ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లాలో 406 మంది ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు లభించాయి. అందులో 29మందికి జిల్లా స్థాయి ఉద్యోగులకు, 372 మందికి ఉద్యోగులకు, 15 మంది స్వచ్ఛంద సేవా సంస్థలకు ఈ అవార్డులు దక్కాయి. శుక్రవారం ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోనున్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయకూడదు

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు



నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో ఏ ఒక్క రైతు బ్లాక్ బర్లీ పొగాకు సాగుచేయకూడదని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం జిల్లా వ్యవ సాయాధికారి కార్యాలయంలో నిర్వహించిన సమా వేశంలో డీఏవో మాట్లాడుతూ ఏ రైతు కూడా బ్లాక్ బర్లీ పొగాకు సాగుచేయవద్దని, తెల్లబర్లీ, వర్జీనియా, ఎఫ్‌సీవీ పొగాకు రకాలు సాగుచేసే రైతులు ముందస్తుగా సంబంధిత కంపెనీతో లిఖిత పూర్వక ఒప్పందం చేసుకుని సాగు చేయా లని సూచించారు. ఒప్పందం లేకుండా సాగుచేసే రైతులకు ప్రభుత్వం ఎలాంటి బాధ్యత తీసు కోదని చెప్పారు. కంపెనీలు జారీ చేసిన ఒప్పందం ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పొగాకు సాగు చేయాలని రైతులను కోరారు.

ఉచిత బస్సు నేటి నుంచే...

● ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో ఏర్పాట్లు ● స్త్రీ శక్తి పథకం అమలుకు సర్వం సిద్ధం



బస్సులను సిద్ధం చేసిన దృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రభుత్వం శుక్రవారం నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఆర్టీసీ బస్సు సేవలను కల్పించనుంది. ఇందుకు సంబంధించి ఆత్మకూరు ఆర్టీసీ డిపో అధికారులు కసరత్తు చేస్తున్నారు. డిపో పరిధిలో 42 ప్రభుత్వ బస్సులు, 30 అద్దె బస్సుల చొప్పున మొత్తం 72 ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో పల్లెవెలుగు 50, అల్ట్రా పల్లెవెలుగు 5, ఎక్స్‌ప్రెస్ 4, డీలక్స్, సూపర్ డీలక్స్‌లు 13 చొప్పున బస్సులు ఉన్నాయి. ఈ బస్సుల్లో ప్రతిరోజు సగటున 22వేల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. ఇందులో మహిళలు 8300 మంది ప్రయాణిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఉచిత బస్సులో అందుబాటులోకి వస్తే.. 40శాతం మహిళల సంఖ్య పెరిగి దాదాపు 11,500 మహిళలు బస్సులో ప్రయాణించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేక్రమంలో బస్సు సీట్ల ఆక్యూపెన్సి రేషియో ప్రస్తుతం 72శాతం ఉండగా అది ఏకంగా 120శాతానికి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే డిపో పరిధిలో ప్రతిరోజు రూ.7లక్షల నుంచి రూ.8లక్షల వరకు ఆర్టీసీకి ఆదాయం వచ్చేది. అయితే ఉచిత బస్సుల కారణంగా రూ.3లక్షల వరకు ప్రభుత్వానికి అదనపు భారం పడనుంది.

స్త్రీశక్తి పథకం నిర్వహణకు ఇబ్బందులు

ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో స్త్రీశక్తి పథకం నిర్వహణకు ఇబ్బందులు ఎదరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డిపో పరిధిలో ప్రస్తుతం 11 బడి బస్సులు నడుస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తే ఆయా బడిబస్సుల సర్వీసులను తగ్గించే పరిస్థితులు ఉన్నాయి. అదేక్రమంలో కండక్టర్లు 106 మంది, డిపో డ్రైవర్లు 64, ఆన్‌కాల్ డ్రైవర్లు 22, మెకానిక్‌లు 13, అసిస్టెంట్ మెకానిక్‌లు 19 మంది పనిచేస్తున్నారు. అయితే కండక్టర్ల కొరత ఏర్పడే అవకాశం ఉండటంతో కండెక్టర్ లేకుండా టిమ్ (టికెట్ జారీ యంత్రాలు) ఆపరేట్ చేసే డ్రైవర్ మాత్రమే ఉండేలా కసరత్తు చేస్తున్నారు. అలాగే డ్రైవర్ల కొరత ఉన్నట్లయితే దినసరి కూలీ కింద ఆన్‌కాల్ డ్రైవర్లను నియమించాలని ఆలోచిస్తున్నారు. మొత్తానికి స్త్రీశక్తి పథకం అమలుకు సంబంధించి ఆర్టీసీ అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన లేక తలలు పట్టుకుంటున్నట్లు తెలిసింది.

ఏర్పాట్లు చేస్తున్నాం



స్త్రీశక్తి పథకం అమలుకు సంబంధించి ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. శుక్రవారం సాయంత్రం 4గంటలకు ఈ సేవలను ప్రారంభిస్తున్నాం. పల్లెవెలుగు, అల్ట్రా, ఎక్స్‌ప్రెస్ బస్సులో మహిళలు ఆధార్, ఓటరు, రేషన్ వంటి గుర్తింపు కార్డులు కలిగి ఉన్నట్లయితే జీరో టికెట్ పేరుతో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తాం. బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పూర్తిస్థాయిలో విధివిధానాలు వస్తే అందుకు తగ్గట్లు ముందుకెళ్తాం.

- వినయ్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆత్మకూరు

భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
● హాజరైన అధికారులు, సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు



వీసీకి హాజరైన కలెక్టర్, అధికారులు, సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూగర్భజలాల పెంపుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు, సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో వీసీలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జేసీ విష్ణుచరణ్, సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో జిల్లాలోని చెరువులు, కుంటలు, చిన్నపాటి మరమ్మత్తులకు గురైన వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వర్షపు నీటిని నిల్వచేయడానికి రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను ప్రోత్సహించడం, చెరువుల్లో పూడికతీత పనులు, చెడ్‌డ్యాంలు, ఫారంపాండ్ల నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలన్నారు.

జూపాడుబంగ్లా: సీఎం చంద్ర బాబు నిర్వహించిన వీసీకి జూపాడు బంగ్లాలోని తహసీల్దార్ కార్యాల యంలో జూపాడుబంగ్లా, పాముల పాడు మండల తహసీల్దార్లు, మైనర్ ఇరిగేషన్ ఇంజినీర్లు, ఎంపీడీవో, నీటిసంఘం చైర్మన్లు హాజరయ్యారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: నీటి వనరులను సకాలంలో రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా నీటి సంఘాల సభ్యులు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఉమారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలంబాషాలు సూచించారు. గురువారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు నీటి సంఘం సభ్యులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్‌తో పాటు మల్లమ్మకుంట చెరువు చైర్మన్ రమణారెడ్డి, మొండికట్ట చెరువు చైర్మన్ చంద్రబాబు, ఈర్ల చెరువు తరుపున శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాణ్యం: నీటి సంరక్షణపై సీఎం నీటి వినియోగదారుల సంఘాల నాయకులు, ఎస్సార్బీసీ అధికారులకు సూచనలు, సలహాలు అందిం చారు. పాణ్యం తహసీల్దారు కార్యాలయంలో వీసీలో తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎస్సార్బీసీ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యం వల్లే చెరువుకు గండి : ఎమ్మెల్యే



మద్దిగుండం చెరువు గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యం వల్లే మద్దిగుండం చెరువుకు గండి పడిందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆరోపించారు. మిడ్తూరు మండలం జలకనూరు గ్రామంలోని మద్దిగుండం చెరువును గురువారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలన కాలంలో మద్దిగుండం చెరువుకు సంబంధించి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. దీంతోనే మద్దిగుండం చెరువుకు నిర్వహణ లేకపోవడంతో ఈ దారుణానికి ప్రధాన కారణమన్నారు. మైనర్ ఇరిగేషన్ శాఖ డీఈ బసవరాజు, టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, శివరామిరెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సురేంద్రరెడ్డి, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ తిరుపాలు తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే జయసూర్య ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం నందికొట్కూరు మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ల సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జయసూర్యను వారు దుశ్శాలువాతో సన్మానించారు. పీఆర్ డీఈ రామ్మోహన్, ఉపాధి ఏపీడీ అన్వరాబేగం, అధికారులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

జూపాడుబంగ్లా, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగడంచ గ్రామంలో మట్టిమిద్దె కూలిపోయింది. మట్టిమిద్దె కారుతుండడంతో బుధవారం రాత్రి రామకృష్ణ తండ్రి చిన్నరంగస్వామి ఇంటిలో రామ కృష్ణతో పాటు కుటుంబసభ్యులు నలుగురు వెళ్లి నిద్రకు ఉపక్రమించారు. ఆ సమయంలో ఎవరులేకపోవడంతో ఘోరప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

'వెంటనే మరమ్మతులు చేపట్టాలి'



చెరువు వద్ద బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

మిడ్తూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జలకనూరు మద్దిగుండం చెరువుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వైసీపీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జలకనూరు గ్రామం వద్ద ఉన్న మద్దిగుండం చెరువుకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం చేసిన నీరు చెట్టు పనులు ఇష్టానుసారంగా నాణ్యత లేకుండా చేయడం వల్లే మద్దిగుండం చెరువుకు గండి పడిందని ఆరోపించారు. చెరువుకు గండిపడి మూడు రోజులు అవుతున్నా ప్రభుత్వం ఎందుకు పూడ్చడంలేదని, ఇక్కడ ఉన్న స్థానిక నేతలు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మద్దిగుండం చెరువు పనులను త్వరితగతిన పూర్తి చేయకపోతే రైతుల పక్షాన తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మంత్రిని కలిసిన ఎస్‌బీ డీఎస్పీ

నంద్యాల టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు, భవనాల పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని నంద్యాల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం కలిశారు. బనగానపల్లెలో మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలోని శాంతి భద్రతలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాలని ఎటువంటి విషయాల్లో రాజీ పడకుండా న్యాయం చేయాలని సూచించారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

ఆత్మకూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆత్మకూరు ఏడీఏ హేమలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆత్మకూరు పట్టణంలోని వసుంధర ఫర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులను తనిఖీ చేసి ఎరువుల అమ్మకాల వివరాలను ఆరా తీశారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో పొగాకు సాగు చేసే రైతులు రిజిస్టర్ కంపెనీలతోనే అగ్రిమెంట్ చేసుకుని పంటను సాగు చేసుకోవాలని ఏడీఏ హేమలత గురువారం సూచించారు.

వినాయక చవితి ప్రశాంతంగా జరిగేలా చూడాలి

ఆత్మకూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ఆయా శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి సూచించారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్, పోలీసు, మున్సిపల్, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆత్మకూరు సీఐ రాము, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎంపీడీవో ఉమర్ ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

నేడు మాంసం విక్రయిస్తే చర్యలు

ఆత్మకూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం మాంసం, చికెన్, చేపల విక్రయాలు చేపడితే చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని నాన్‌వెజ్ హోటళ్లకు, ఆయా మాంసపు దుకాణాలకు నోటీసులు జారీ చేశామని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేక్రమంలో శుక్రవారం మద్యం దుకాణాలను కూడా మూసి వేయడం జరుగుతోందని చెప్పారు.

పంటల పరిశీలన

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అధిక వర్షపాతానికి గురైన మొక్క జొన్న, కంది, ఉల్లి పంటలను ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాత ఆమె బృందం, నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు గిరీష్, మండల వ్యవసాయ అధికారి షేక్షావలిగురువారం మండలంలోని దామగట్ల, అల్లూరు గ్రామాలలో పర్యటించి పంటలను పరిశీలించారు. రైతులు, గ్రామ రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: అధికవర్షాలకు పంటల సంరక్షణ అవసరమని ప్రధానశాస్త్రవేత్త సుజాత అన్నారు. మండలంలోని మండ్లెం గ్రామంలో ఇటీవల కురసిన వర్షాలకు మొక్కజొన్న, పత్తిపంటలను సంరక్షించుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి, వ్యవసాయసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయలసీమ జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఆర్జీఎం జట్టు ప్రాతినిధ్యం

పాణ్యం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జోన్4 బాస్కెట్‌బాల్ పోటీలకు నంద్యాల జిల్లా తరపున ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల జట్టు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆర్జీఎం డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా రాయలసీమ జోన్ 22ఏళ్ల స్థాయిలో జరిగే బాస్కెట్ బాల్ పోటీలలో జిల్లా తరపున ఆర్జీఎం కళాశాల క్రీడాకారుల జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఈనెల 17, 19 తేదీలలో జరిగే పోటీలలో రాయలసీమలోని 8 జిల్లాల జట్లు పాల్గొంటాయన్నారు. గెలిచిన ప్రథమ, ద్వితీయ స్థానాల జట్లు ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా విజయవాడలో జరిగే సెంట్రల్ జోన్ పోటీలలో పాల్గొంటాయన్నారు. రాష్ట్రంలోని నాలుగు జోన్‌లలో గెలిచిన జట్లు ఈ పోటీలలో పాల్గొంటాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎండీ శివరాం, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంకటేశ్, నాయక్, మంజుల, గణేశ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలి

నందికొట్కూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు భావి భారత పౌరులదేనని, ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలని నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణంలోని పురవీధుల్లో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. అకడమిక్ కో ఆర్డినేటర్ ఆర్.రఘుపతి రెడ్డి, సదస్సు కన్వీనర్ డా.హుస్సేన్, ఎన్ఎస్ఎస్ అధికారి ఖజాహుస్సేన్ పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంచుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాసగౌడ్ సూచించారు. గురువారం పట్టణంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం నాయకుడు వెంకటేశ్, మాజీ ఏబీవీపీ నాయకులు భాను ప్రకాష్‌రెడ్డి, జగన్, హరి, శ్రీరామ్, సుప్రేం, మహేంద్ర, తారక్, అశ్విన్ పాల్గొన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జాతీయ సమైక్యతకు పాటుపడాలని శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రగతిరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మేడా మురళీధర్, తూముశివారెడ్డి, నిమ్మకాయల సుధాకర్, కొట్టి చంద్ర, సూర్యదేవర సుధాకర్, డాక్టర్ లలితాసరస్వతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో గురువారం షష్టి సందర్భగా ఉదయం సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు ఆలయ వేదపండితులచే నిర్వహించారు. స్వామివారి అభిషేకానికి ముందుగా మహా గణపతి పూజ, పంచామృత అభిషేకం, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైల క్షేత్రంలో నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా గురువారం లిక్షితాశ్రీ నృత్యకళాశాల విద్యార్థులతో సంప్రదాయ నృత్యప్రదర్శన ఏర్పాటుచేశారు.

నేడు కామేశ్వరీదేవికి నెమలి పించాలతో అలంకరణ

మహానంది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రావణ నాల్గవ శుక్రవారం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి 15 వందల నెమలి పింఛములతో అలంకారం చేస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఇందుకోసం తమిళనాడు లోని అంబూరుకు చెందిన కళాకారులు మహానందికి వచ్చి నెమలి పింఛములతో మాలలు సిద్ధం చేస్తున్నారు. శుక్రవారం రోజు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు నెమలి పింఛములతో కూడిన అలంకారంతో అమ్మవారిని దర్శించుకొనే విధంగా వీలు కల్పిస్తామని చెప్పారు. ఈఏడాది అమ్మవారికి శ్రావణమాసం ప్రతి శుక్రవారం వివిధ వస్తువులతో అలంకారం చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి

పగిడ్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో అభ్యతరాలు ఉంటే సంబంధిత రైతులు దరఖాస్తులు చేసుకుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు డీటీవో ఉమాపతి రైతులుకు తెలిపారు. మండల పరిధిలోని పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రీసర్వే పై రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మురళీ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. అనతరం గ్రామసభలో రైతులకు సంబంధించిన భూములు, విస్తీర్ణం, ఎల్‌పీఎం నెబంర్ల వివరాలను చదివి వినిపించారు. వీఆర్వో నాగన్న, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు ఉన్నారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

నంద్యాల టౌన్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటి పరిధిలోని అనధికార లేఅవుట్లు, ప్లాట్లు అందరు క్రమబద్ధీకరించుకోవాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30 వరకు ఉన్న అనధికారి లేఅవుట్లు అందరు క్రమబద్ధీకరణ పథకం 2020ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా అపరాధ రుసుం 14శాతం ఓపెన్ సెస్‌లో సగం 7 శాతం చెల్లించి చేసుకోవాలన్నారు. 90 రోజుల్లోగా ఆన్‌లైన్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.


తైక్వాండో పోటీల్లో ప్రతిభ

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని ఎల్‌కేఆర్ గ్లోబల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ కోటి నాగేశ్వరావు తెలిపారు. ఈ నెల 13న కర్నూలులో తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో 10బంగారు, 7వెండి, 4కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేందుకు పాఠశాల యాజమాన్యం కృషిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

బీమా చెక్కు అందజేత

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో నజీమా కు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద వచ్చిన రూ.2 లక్షల రూపాయల చెక్కును ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, టీడీపీ నాయకుడు మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి అందజేశారు. బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ఎస్‌జనజీమా భర్త బాషా ట్రాక్టర్ క్రింద పడి మరణించారు. పీఎంఎస్‌బీవై పథకంలో నామిని గా ఉన్న భార్య ఎస్. నజీమాకు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం కౌన్సిలర్ నాగార్జున, ఎస్ఎస్‌టీ సంస్థ పీడీ ఆంజనేయులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా మద్దూరు హరిసర్వోత్తమ రెడ్డి



నందికొట్కూరు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణకొట్కూరు సహకార పరపతిసంఘానికి సింగిల్ విండో చైర్మన్‌గా బ్రాహ్మణకొట్కూరుకు చెందిన మద్దూరు హరిసర్వోత్తమరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలివడినట్లు సొసైటీ సీఈవో అశోక్ కుమార్ తెలిపారు. డైరెక్టర్లుగా అల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, వడ్డెమాను గ్రామానికి చెందిన నాగశేషులు నాయుడు నియమితులైనట్లు సీఈవో తెలిపారు. గతంలో కూడా హరిసర్వోత్తమరెడ్డి ఇదే సొసైటీకి చైర్మన్‌గా పని చేశారు.

‘స్త్రీ శక్తి’కి సర్వం సిద్ధం

- కర్నూలు జిల్లాలో 231 బస్సుల్లో సౌకర్యం
- 25 వేలకు పైగా మహిళలు ఉపయోగించుకునే అవకాశం
- సన్నాహాలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు
- నేటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



కర్నూలు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే స్త్రీశక్తి పథకం అమలుకు శ్రీకారం చుట్టనుంది. శుక్రవారం నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు సర్వం సిద్ధంచేశారు. మహిళలకు జీరో చార్జీ టికెట్ ఇస్తారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గ కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఆర్టీసీ అధికారులు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 5గంటల తరువాత ఈసౌకర్యం అందుబాటులోకి రానుంది. జిల్లాలో దాదాపుగా 25 వేల మందికి పైగా మహిళలు రోజు ఉచిత ప్రయాణం సౌకర్యం పొందే అవకాశముందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 231

జిల్లాలో కర్నూలు-1, 2, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ ఆర్టీసీ డిపోల పరిధిలో పల్లె వెలుగు నుంచి హైటెక్ సర్వీస్ వరకు వివిధ బస్సులు 390 ఉన్నాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 270 ఉన్నాయి. వీటిలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లోని అన్ని రూట్లలో వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు 231 బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో నాన్‌స్టాప్ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు. జిల్లాలో నాన్ స్టాప్ బస్సులను సింగిల్, టూ, త్రీ స్టాప్ బస్సులుగా మార్చడంతో వాటిలో కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తారు. దీంతో సూపర్ లగ్జరీ, అల్ట్రా డిలక్స్, హైటెక్ వంటి బస్సుల మినహా అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఎలాంటి చార్జి చెల్లించకుండా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

ఆ సర్వీస్‌ల్లో ఉచితం లేదు



అంతర్రాష్ట్ర, ఘాట్ రూట్లలో నడిపే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం లేదు. కర్నూలు- బళ్లారి వయా ఎమ్మిగనూరు, ఆదోని సర్వీస్ 6 బస్సులు, ఎమ్మిగనూరు-బళ్లారి వయా ఆదోని, ఆలూరు సర్వీస్ 6 బస్సులు, ఎమ్మిగనూరు, ఆదోని నుంచి బెంగళూరు వెళ్లే 5, హైదరాబాద్‌కు వెళ్లే ఒక బస్సు సహా కర్ణాటకలోని సిరుగుప్ప, తెలంగాణ రాష్ట్రంలోని ఐజ, ఘాట్ రూట్ శ్రీశైలానికి నడిపే 39 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు.

సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేశాం. జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించేలా ఏర్పాటుచేశాం. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. టిమ్స్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేశాం.

- శ్రీనివాసులు, ఆర్‌ఎం, ఏపీఎస్ ఆర్టీసీ, కర్నూలు

అదృశ్యమయ్యాడు.. శవమై తేలాడు..

- అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కర్నూలు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన ఓ యువకుడు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో శవమై తేలాడు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విక్రమసింహ తెలిపారు. వివరాలు.. కృష్ణానగర్‌కు చెందిన విశ్వనాథ్‌గౌడ్(34) నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆయన భార్య నాగమణి నాలుగో పట్టణ పోలీసులకు నాలుగు రోజుల క్రితమే ఫిర్యాదు చేసింది. గురువారం కోడుమూరు పరిధిలోని లద్దగిరి వద్ద హెచ్ఎన్ఎస్ఎస్(హంద్రీనీవా సుజలస్రవంతి) కాలువలో శవమై కనిపించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచామివ్వగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఓ దినపత్రికలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు కొడుకు, కూతురు ఉన్నారు. ఆయన మృతిపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నంద్యాలకు చెందిన కొంత మందికి అధిక వడ్డీలకు కొంత మొత్తాన్ని అప్పులు ఇచ్చారు. తిరిగి ఇవ్వకుండా సతాయిస్తుండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సఫా కాలేజీ హెచ్ఎన్ఎస్ఎస్ సమీపంలో బైక్ లభ్యమైంది. ఎవరైనా నదిలోకి తోసి ఆయన మృతికి కారణమై ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



విశ్వనాథ్ గౌడ్(ఫైల్)

పెయింటర్ బలవన్మరణం

మంత్రాలయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన పెయింటర్‌గా పనిచేస్తున్న బోయ రమేష్(36)అనే వ్యక్తి గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రంగమ్మ పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఉన్న పురుగుల మందును బోయ రమేష్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి మృతి చెందాడు. మృతుడి సోదరి చిలకలడోణ గ్రామానికి చెందిన బోయ తాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం పోస్టుమార్టం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా మృతుడు రమేష్‌కు భార్య రంగమ్మ, ఒక కుమారుడు సంతానం.



బోయ రమేష్ (ఫైల్)

యువకుడి ఆత్మహత్య

ఓర్వకల్లు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన బోయ అనిల్ (22) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనిల్ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. అనిల్ కుమార్‌కు ఏడాది క్రితం వివాహమైంది. అయితే భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు యువకుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.



అనిల్ (ఫైల్)

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కర్నూలు క్రైం/వెల్దుర్తి, వెల్దుర్తి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందించే ఎరువులు, డీఏపీ, యూరియా మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ సీఐ పవన్ కిషోర్ హెచ్చరించారు. గురువారం విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు జిల్లాలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ కిషోర్, మండల విజిలెన్స్ వ్యవసాయాధికారి ఎస్.విశ్వనాథ్, వెల్దుర్తి ఏవో ఆర్.అక్బర్ బాషా ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వెల్దుర్తి మండంలలోని శ్రీ సాయికృష్ణ ఫర్టిలైజర్స్ శ్రీనివాస ఆగ్రో ఏజెన్సీస్, రేణుకా మాత ఆగ్రో ఏజెన్సీస్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ అలాగే కర్నూలులోని పలు దుకాణాలు, గోడౌన్‌లను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినందున రూ..3,74,407 విలువ గల 390 బస్తాల ఎరువులు అమ్మకాల నిలుపుదల చేశారు.

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది

- ‘కుడా’ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



టీడీపీ కార్యాలయం వద్ద నాయకుల సంబరాలు

కర్నూలు అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థుల గెలుపుతో ప్రజాస్వామ్యం గెలిచిందని ‘కుడా’ చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయం ఎదుట రాష్ట్ర ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, డీసీఎంహెచ్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, నాయకులు, కార్యకర్తలు బాణ సంచాలపేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ పులివెందుల గడ్డలో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాకుండా ప్రజలు ఓడించారన్నారు. గత 3 దశాబ్దాలుగా ఓటు వేయని ప్రజలు తమకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని కోరారని, పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు థరూర్ జేమ్స్, పాలక వీటి విజయకుమార్, సత్రం రామకృష్ణ, ఆర్.బాబురావు, గున్నామార్క్, పేరపోగు చిన్న మారెన్న తదితరులు పాల్గొన్నారు.

వీడిన మహిళ మిస్సింగ్ మిస్టరీ

- బ్యాంకు మేనేజరే సూత్రధారి..
- మహిళను తీసుకువచ్చి తహసీల్దార్ ఎదుట హాజరుపరచిన పోలీసులు

ఆలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. పలీసుల కథనం మేరకు.. గత నెల 8న అదృశ్యమైనట్లు బంధువులు ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేశారు. 35 రోజులు గడిచినా ఆచూకీ లభించలేదు. స్టేట్ బ్యాంక్‌లో మేనేజర్‌పై బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేయగా, తనకు తెలియదంటూ మేనేజర్ సమాధానమిచ్చాడు. చివరకు బుధవారం బ్యాంకు మేనేజర్‌తో కలిసి దిగిన ఫొటోలు వాట్సాప్ గ్రూపులో వైరల్ కావడంతో పోలీసులు విచారణ చేయగా కర్ణాటకలోని తోరణగల్‌లో ఓ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ మహబూబ్ బాషా ఆమెను ఆలూరుకు తీసుకొచ్చారు. తహసీల్దార్ శోభా సువర్ణమ్మ ఎదుట హాజరుపరచగా తాను ఇష్టపూర్వకంగానే వెళ్లానని మహిళ స్టేట్‌మెంట్ ఇవ్వడంతో పోలీసులు ఆమె అంగీకారం మేరకు భర్తకు అప్పగించారు.

కిడ్నాప్ కేసులో ఐదుగురు అరెస్ట్

మండలంలోని మొలగవల్లి స్టేట్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్‌ను కిడ్నాప్ చేసి దాడి చేసిన కేసులో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం నిందితులు జీవన్‌కుమార్, బసవరాజు, దస్తగిరి, రామాంజనేయులు, రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇది ప్రజాస్వామ్య విజయమే

- జగన్ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది
- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం ప్రజాస్వామ్య విజయమేనని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యం గెలిచిన రోజు అని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో 14నెలల కూటమి ప్రభుత్వం సంక్షేమ సుపరిపాలన అభివృద్ధిపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పులివెందులలో నియంతృత్వ ఏకగ్రీవాలకు చరమగీతం పాడినరోజే టీడీపీ మానసికంగా గెలి చిందన్నారు. నేడు జగన్ సీఎం చంద్రబాబు వయస్సు, పాప పుణ్యాలు మాట్లాతుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందన్నారు. జగన్ ప్రజాస్వామ్యం, ఎన్నికల్లో అరాచకం అంటూ మాట్లాడుతుంటే చిన్నపిల్లలు సైతం నవ్వుకుంటున్నారన్నారు. నియంతృత్వ ఏకగ్రీవాల నుంచి బయటపడి పులివెందుల ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న రోజే టీడీపీ విజయం ఖరారైందన్నారు. ఇప్పటికైనా వైసీపీ, జగన్ కళ్లు తెరిచి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలన్నారు. జగన్ లాంటి అప్రజాస్వామ్య వాదులు అరాచక శక్తులకు టీడీపీ విజయం చెంపపెట్టులాంటి దన్నారు. భవిష్యత్‌లో వైసీపీని ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ ఓటు ద్వారా బుద్ధిచెబుతారన్నారు.

నేలకొరిగిన మావోయిస్టు సభ్యుడు నాగన్న

- చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో హతం
- 22ఏళ్ల వయస్సులోనే ఉద్యమ బాటలోకి
- ఆయన స్వగ్రామం వడ్లరామాపురం





వడ్లరామాపురం ఏరియల్ వ్యూ, ఇన్‌సెట్‌లో నాగన్న(ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న నల్లమల ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఈ ప్రాంతం నుంచి మావోయిస్టు ఉద్యమంలోకి అడుగిడిన సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్ అలియాస్ సుగులూరు నాగన్న (57) చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని చౌకీ జిల్లాలో గల రాజ్‌నంద్ గావ్ - కాంగేర్ సరిహద్దులో బుధవారం జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగారు. నల్లమల కేంద్రంగా సాగిన అనేక దళాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు ఉద్యమంలో కీలక వ్యవహరిస్తూ వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన ప్రస్తుతం దండకారణ్యా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అక్కడి దండకారణ్యంలో మావోయిస్టులకు, పోలీసుల జరిగిన పరస్పర కాల్పుల నేపథ్యంలో ఎన్‌కౌంటర్‌లో ఆయన హతమయ్యారు.

విప్లవ సాహిత్యానికి ఆకర్షితులై...

ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామానికి చెందిన సుగులూరి దానమయ్య, దానమ్మ దంపతుల కుమారుడైన చిన్నన్న మావోయిస్టు పార్టీ వైపు అడుగులు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దానమయ్య దంపతులకు మొత్తం నలుగురు కొడకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నాయి. వీరిలో రెండో కుమారుడైన చిన్నన్న ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే 10వ తరగతి వరకు విద్యనభ్యసించారు. ఆతర్వాత గ్రామంలోనే పట్టుపురుగుల బుట్టలు, తడికలు అల్లుకుని జీవనం సాగించేవారు. ఆసమయంలోనే సాధారణ గ్రామ రైతు కూలీ సంఘం సభ్యుడిగా కొనసాగారు. ఈ క్రమంలోనే 1988లో కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామానికి చెందిన సరోజమ్మను వివాహం చేసుకున్నారు. ఈయనకు క్రాంతికుమార్, రామకృష్ణ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే ఆ సమయంలో తరుచూ అటవీశాఖ అధికారులు దళితులను చిత్రహింసలకు గురిచేయడం, తప్పుడు కేసులు బనాయించడం కారణాలతో మావోయిజం వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకున్నారు. ఆ సందర్భంలోనే నల్లమలను కేంద్రంగా చేసుకుని అటవీ సమీప గ్రామాల్లో మావోయిస్టులు కార్యకలాపాలు కొనసాగించేవారు. ఈ క్రమంలో వడ్లరామాపురం గ్రామానికి రాత్రివేళల్లో నక్సల్స్ చేరుకుని విప్లవ సాహిత్యంతో యువతను ఆకర్షించేవారు. ఇందులో భాగంగానే 22ఏళ్ల చిరుప్రాయంలోనే ఆయన మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇటీవల వడ్లరామాపురంలో పర్యటించిన చత్తీస్‌ఘడ్ బలగాలు

దేశంలో మావోయిస్టు ఏరివేతపై కేంద్ర హోంశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది మే 10,11,12 ఆపరేషన్ కగార్ పేరుతో తేదీల్లో చత్తీస్‌ఘడ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో పోలీసులు కాల్పులు చేపట్టారు. ఈ ఘటనలో ఎవరూ ఊహించని విధంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఈ ఘటనలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆస్పరి మండలం ములుగుగుంద గ్రామానికి చెందిన సంగీత అలియాస్ లలిత అనే మహిళా మావోయిస్టు మరణించారు. ఆ సమయంలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్న సుగులూరు చిన్నన్న ఆ ఘటనలో తప్పించుకున్నట్లు తెలిసింది. దీంతో ఆయన గురించి చత్తీస్‌ఘడ్ పోలీసులు మే 13న ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పూర్వ వివరాలు సేకరించారు. ఈ క్రమంలోనే ఆయనను పట్టిస్తే రూ.25 లక్షల రివార్డును కూడా చత్తీస్‌ఘడ్ పోలీసులు ప్రకటించారు. మొత్తానికి సుగులూరు చిన్నన్న బ్రతికే ఉన్నాడని తెలియడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం నెలకొంది. అయితే సరిగ్గా మూడు నెలల్లోపే ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం చిన్నన్న భార్య, కొడుకులు కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామంలో నివాసం ఉండగా, ఆయన సోదరులు రాజగోపాల్, రవిచంద్రబాబు, భూపాల్‌లు వడ్లరామాపురం గ్రామంలోనే ఉంటున్నారు. 20ఏళ్ల క్రితం చర్చల సమయంలో ఒకసారి మాత్రమే ఆయన కుటుంబ సభ్యులతో కలిసినట్లు తెలిసింది. అప్పటి నుంచి నేటి వరకు ఆచూకీ లేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు.

మృతదేహం కోసం కుటుంబ సభ్యుల ప్రయత్నం

చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు సుగులూరి చిన్నన్న మృతదేహం కోసం ఆయన కుమారులు క్రాంతికుమార్, రామకృష్ణలు నంద్యాల జిల్లా ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణాను సంప్రదించినట్లు తెలిసింది. వారి వివరాలను సమర్పించి చత్తీస్‌ఘడ్‌కు వెళ్లి తండ్రి మృతదేహాన్ని స్వగ్రామమైన వడ్లరామాపురానికి తీసుకురావాలని వారు ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రస్తుతం వడ్లరామాపురం గ్రామానికి వెళ్లే రహదారిపై భవనాశి ఉధృతంగా ప్రవహించడంతో వారి సోదరులు గ్రామం నుంచి బయటకు రాలేకపోతున్నారు. వారు కూడా చిన్నన్న మృతదేహం కోసం ఎదురుచూస్తున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

బనగానపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య గురువారం కోరారు. ఈ మేరకు బనగానపల్లె సీపీఐ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 23నుంచి 25 వరకు ఒంగోలులో నిర్వహించే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ, సమాజిక అంశాలపై పాలకప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు,దేశ సమగ్రత కోసం వివిధ వర్గాల సమస్యల కోసం ముందుకెళ్లడానికి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు జాతీయ రాజా, నారాయణ, సాంబశివరావు వంటి రాష్ట్ర , దేశనాయకులు హాజరవుతారన్నారు. సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, శివబాలకృష్ణ, నాగంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాతపద్ధతినే కొనసాగించాలి

చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మూల్యాంకన విధానంలో పాతపద్ధతినే కొనసాగించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్ బాషా తెలిపారు. గురువారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష నిర్వహణ విధానంలో అసెస్‌మెంట్ పుస్తకాలతో కొత్త విధానాన్ని తీసుకురావడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. గతంలో పరీక్షా పేపర్లు ఇంటి వద్దకు తీసుకెళ్లి మూల్యాంకనం చేసే అవకాశం ఉండేదన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారని, ప్రస్తుతం బబ్లింగ్ అనే కొత్తపద్ధతిని ఏర్పాటు చేయడంతో భారంగా మారిందన్నారు. ఎస్టీయూ మండల కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, జిల్లా సహాయ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, సురేషప్ప, రాజశేఖర్‌రెడ్డి, ఉస్మాన్, శేషాద్రి, శ్రీనివాసులు ఉన్నారు.

యువకులకు క్రీడా పోటీలు ప్రారంభం

చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన వివిధ ఆటల పోటీలను ఆ సంఘ అధ్యక్షుడు గౌస్‌బాషా, ప్రధాన కార్యదర్శి గౌస్‌మోద్దీన్ ప్రారంభించారు. యువకులకు క్రికెట్, క్యారమ్‌బోర్డు, చెస్, సెటిల్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు జెండావందనం రోజు బహుమతులను అందజేస్తామన్నారు. సంఘ సభ్యులు సాదిక్‌వలి, అబ్దుల్లా, దాదాపీర్, మహబూబ్‌బాషా, ఉసేన్‌పీర, కార్యవర్గ సభ్యులు పీడీ శ్రీనాథ్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు

చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 సచివాలయాల పరిధిలోగల 127 మంది వికలాంగుల పింఛన్లను తొలగించినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. వికలాంగులకు చెందిన సదరన్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌లో సరిగా లేనందున వీటిని తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా క్షీరాభిషేకం

చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి సాయినాథ మందిరంలో గురువారం జల, క్షీరాభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా సాయివ్రతం నిర్వహించారు. అనంతరం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

వైసీపీ హయాంలో కక్ష సాధింపు

● రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపులతో బిల్లుల చెల్లించడంలో జాప్యం చేసి కాంట్రాక్టర్లకు నరకం చూపించిందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బనగానపల్లె నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు, లబ్ధిదారులకు మంత్రి చేతులమీదుగా బిల్లులు చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2014-19లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడం అభినందనీయమన్నారు. 2017-18 మధ్య కాలంలో మినీగోకులం షెడ్లు, సీసీ రోడ్లు, ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులు, హార్టికల్చర్ కింద మంజూరైన పనులు సకాలంలో పూర్తిచేసినా అప్పటి వైసీపీ ప్రభుత్వం బిల్లులు హోల్డ్‌లో


కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఉంచిందన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని సుమారు 376మంది లబ్ధిదారులకు రూ.74లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ


జాతీయ పతాకం పట్టుకుని ర్యాలీలో పాల్గొన్ననాయకులు, విద్యార్థులు

బేతంచెర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బేతంచెర్లలో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ర్యాలీని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ర్యాలీలో సుమారు 300 అడుగులు జాతీయ జెండాతో సరస్వతి శిశు మందిర్ రెండు పాఠశాలల విద్యార్థులు, జ్ఞాన సరస్వతి కాలేజీ ఇంటర్, డిగ్రీ విద్యార్థులు జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ భరతమాత వేషధారణతో, డ్రమ్స్ మార్చ్‌ఫాస్ట్‌తో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కొత్తబస్టాండు నుంచి రైల్వేస్టేషన్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, ఆర్మీ ఉద్యోగులు, రేటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు మారుతీకృష్ణ, బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, నాగమోహన్, సీనియర్ న్యాయవాది నందిపల్లె నారాయణ, టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, బేతంచెర్ల సహకార సంఘం సొసైటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు పాటించాలి

డోన్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి కళ్యాణి అన్నారు. గురువారం మండలంలోని ధర్మవరం, కొచ్చెర్వు గ్రామాల్లోని ఉద్యాన పంటలను ఆమె పరిశీలించారు. వర్షకాలం కావడంతో వర్షం నీరు పంటల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిలిస్తే త్వరితగతిన ఆ నీటిని బయటకు పంపించాలన్నారు.మామిడి, అరటి, జామ, దానిమ్మ, సపోట, తదితర ఉద్యాన పంటల్లో వానల సమయంలో వచ్చే తెగుళ్ల వాటికి తీసుకోవాల్సిన నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

వసుధా ఫౌండేషన్ సేవలు మరువలేనివి

● బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గానికి వసుధా ఫౌండేషన్ అందిస్తున్న సేవలు మరువలేవని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయం ఆవరణంలో వసుధా ఫౌండేషన్ కోఆర్డినేటర్ టంగుటూరు శ్రీనయ్య ఆధ్వర్యంలో రోగులకు చెక్కులు అందించారు. రూ.45వేల విలువచేసే చెక్కులను టంగుటూరు శ్రీయయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇందిరమ్మ మాట్లాడుతూ ఫౌండేషన్ అధ్యక్షుడు మంతెన వెంకటరామరాజు ద్వారా నగదు అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. టీచర్ నాగరాజు, కల్నాటి అభిలాష్, ముడియం సూర్యవర్దన్ రెడ్డి, ఖాదర్, పవన్‌కుమార్‌రెడ్డి, మదనభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి : ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో కేపీ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో అన్ని శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ స్థాయిలోని గణేష్ ఉత్సవాలను అన్ని మతాల వారిని కలుపుకుని జరుపుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్నఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

పాతబకాయిల చెల్లింపునకు అనుమతి

2014-19 మధ్యకాలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం కింద పని చేసి బిల్లులు రాకుండా చేసిన వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసింది. వారి ఇబ్బందులను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసేందుకు ఆదేశాలు జారీ కావడంతో ఎమ్మెల్యే కోట్ల కాంట్రాక్టర్లకు పే స్లిప్పులు పంపిణీ చేశారు. డీఎల్‌డీవో నరసింహ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, ఏపీవో షకుర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం లక్ష్యం

బేతంచెర్ల: అభివృద్ధి, సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం బేతంచెర్ల మండలం కొలుములపల్లె గ్రామంలోని సచివాలయంలో మండల సింగిల్ విండో అధ్యక్షుడు ఉన్నం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రైతులకు 444 బస్తాల యూరియాను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ బేతంచెర్ల మండలంలో యూరియా అవసరం ఎక్కువగా ఉండటంతో ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్‌తో చర్చించి అదనంగా 20 టన్నులు మంజూరు చేయించారన్నారు. సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు ఉన్నం చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, పోలూరు శ్రీనివాసరెడ్డి, ఉన్నం సుధాకర్, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే టీటీడీ కల్యాణ మండపంలో బుగ్గానిపల్లె గ్రామ నాయకుడు రాముడు కుమారుని వివాహ వేడుకలకు హాజరయ్యారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

డోన్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తిరోడ్డులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆసుపత్రుల సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లలిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు గదులను, ల్యాబ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, రికార్డులను హాజరు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు.

ఆంజనేయ స్వామికి వెండి జంధ్యం సమర్పణ

ఉయ్యాలవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ మెట్ట వద్దవెలసిన అభయాంజ నేయ స్వామికి ఆ గ్రామానికి చెందిన కోన నారాయణరెడ్డి, సుధారాణి దంపతులు రూ.35వేలు విలువజేసే జంధ్యాన్ని వితరణగా అందించారు. అర్చకుడు లక్ష్మణస్వామికి ఆభరణాన్ని అందించారు.

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రైతును రాజుగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి పట్టణ ప్రధాన రహదారి గుండా పాత బస్టాండ్ వరకు రైతులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే అఖిలప్రియ ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చెప్పిన సూపర్ సిక్స్ పథకాలలో అన్నదాత సుఖీభవ పథకం ఒకటన్నారు. ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతగా రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతోనే నేడు పులివెందులలో టీడీపీకి ప్రజలు 30 ఏళ్ల తరువాత బ్రహ్మరథం పట్టారన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

రుద్రవరం: పల్లెల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని నరసాపురం గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును


ర్యాలీలో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్నఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధే లక్ష్యంగా భావిస్తోందన్నారు. ప్రతి పల్లెనూ అభివృద్ధి వైపు నడిపిస్తామని, ఇటీవలే ఎర్రగుడిదిన్న - రుద్రవరం రహదారిపై వంతెన పనులకు భూమి పూజ చేశామన్నారు. వరుసక్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం శాంతకుమారి, టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ బలరామిరెడ్డి, శ్రీనివాసులు, పుల్లారెడ్డి, ఫకీరా, పీఆర్ ఏఈ కమాల్‌సాహెబ్, పంచయాతీ కార్యదర్శి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో అనధికార వ్యక్తులు పాల్గొంటే ఎలా?

● సర్వసభ్య సమావేశంలో అధికారుల ఆవేదన

కోవెలకుంట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశంలో అనధికార వ్యక్తులు పాల్గొంటే ఎలా అని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కోవెలకుంట్ల మండల సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షురాలు భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశంలో ప్రజాప్రతినిధులకు బదులు ఎంపీపీ భర్త, మరికొంతమంది అనధికార వ్యక్తులు పాల్గొనడం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీడీవో భరణి మాట్లాడుతూ అధికారులు వారి ప్రగతిని వివరించాలని సూచించారు. అధికారులు వారి శాఖలకుచెందిన ప్రగతిని చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీకళ మాట్లాడుతుండగా ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి భర్త ప్రతాప్‌రెడ్డి కలుగజేసుకుని పథకంలో అవినీతి ఎక్కువైందన్నారు. అలాగే వల్లంపాడుకు చెందిన మరో అనధికార వ్యక్తి కలుగజేసుకుని 'మా ఊరిలో కూడా మొక్కలు నాటారని, అవి చనిపోయాయన్నారు. మండల సభలో అనధికార వ్యక్తులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో


మాట్లాడుతున్న ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి భర్త ప్రతాప్‌రెడ్డి

అధికారులు నివ్వెరపోయారు. అనంతరం మండల డిప్యూటీ ఎంపీడీవో, కోవెలకుంట్ల ఇన్‌చార్జ్ ఈవో ప్రకాశ్‌నాయుడు మాట్లాడుతూ కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుద్దీపాల ఏర్పాటుకు మూడు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పులివెందులలో చారిత్రాత్మక విజయం

● రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల విజయం ఒక చరిత్రాత్మకమని ఏపీ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించడంతో గురువారం ఎంఎస్ఆర్ కార్యాలయం వద్ద ధర్మవరం సుబ్బారెడ్డి అనుచరులు, టీడీపీ నాయకులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ రాఘవేంద్ర, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్యాపిలి మండల అధ్యక్షుడు రామసుబ్బయ్య, టీడీపీ యువనాయకులు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి, అడ్వకేట్ మల్లికార్జునరెడ్డి, చక్రపాణిగౌడు పాల్గొన్నారు.


స్వీట్లు తినిపించుకుంటున్న దృశ్యం

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది : వీఆర్

కొలిమిగుండ్ల : పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని టీడీపీ నియోజకవర్గ కో-కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా ఎన్నికలు లేని పులివెందుల జడ్పీటీసీకి మొదటిసారి 11మంది పోటీ చేశారంటే కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి కల్పించిన భరోసానేనన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలే అభ్యర్థుల గెలుపునకు కారణమయ్యాయన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌గా ఉసేన్‌రెడ్డి


ఉసేన్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి సింగిల్ విండో చైర్మన్‌గా తోడెండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు ఉసేన్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం చాగలమర్రి సొసైటీ వద్ద ఎంపికైన ఉసేన్‌రెడ్డిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. సొసైటీ అధ్యక్షుడిగా ఎంపిక చేసిన సీఎం చంద్రబాబునాయుడు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత రెడ్డి, భార్గవ్‌రామ్‌లకు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో చైర్మన్‌గా బాధ్యలు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామసుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గోపాల్, బాబయ్య, ప్రమోద్‌కుమార్, హరి, సంజీవరెడ్డి, చౌడన్న పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. గురువారం చాగలమర్రిగ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో బాలికల కోసం తయారు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. మెనూ పాటించాలన్నారు. అనంతరం విద్యార్థుల అసెస్‌మెంట్ పరీక్షలను పరిశీలించారు. హెచ్ఎం శివలక్ష్మి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శిరివెళ్ల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీవర్షాల నేపథ్యంలో గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. నీటి వనరుల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



డోన్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు కార్యాలయం వద్ద వెలుగు సిబ్బంది గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా గుర్రం కొండ వెలుగు ఏపీఎం రజినీపై అక్కడ వైసీపీ చెందిన కొందరు నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డోన్ వెలుగు ఏపీఎం మల్లికార్జున, వెలుగు సీసీలు కృష్ణమూర్తి, ఈశ్వరమ్మ, చంద్రశేఖర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బీసీతో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ భేటీ

బనగానపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురు వారం రోడ్లు భవ నాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి జిల్లాలోని శాంతిభద్రతలపై, ప్రజలకు రక్షణ కల్పించడం వంటి వాటిపై చర్చించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

చాగలమర్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చింతలచెరువు రహదారిలో బషీరున్నీసా ఇంటిలో జరిగిన చోరీ సంఘటనపై ఈనెల 11న కేసు నమోదైంది. ఈ కేసులో విచారణ చేపట్టిన ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. చాగలమర్రికి చెందిన నిందితుడు మాబు షరీఫ్‌ను మల్లేవేముల గ్రామానికి వెళ్లే రహదారిలో అరెస్టు చేసి 4 తులాల బంగారు, 56 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి ఆళ్లగడ్డ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా నిందితుడికి రిమాండ్ విధించి నంద్యాల సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

పోలీసులను ఆశ్రయించిన విద్యుత్ అధికారులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ అధికారులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆళ్లగడ్డ పట్టణంలోని పాత కందుకూరు కూడలిలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ అధికారిపై హుసేన్‌రెడ్డి అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. హుసేన్‌రెడ్డికి సంబంధిచిన స్థలంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని టేకు చెట్టు కొమ్మలను తొలగించారు. దీంతో హుసేన్‌రెడ్డి నేరుగా విద్యుత్ ఉద్యోగికి ఫోన్ చేసి దురుసుగా మాట్లాడటంతో వారు పోలీసులను ఆశ్రయించారు.

రెండు రోజుల పాటు విద్యుత్ అంతరాయం

డోన్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంతో పాటు డోన్ పట్టణ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వెంకటాపురం ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ (ఆర్‌డీఎస్) ఆధ్వర్యంలో 11 కేవీలైన్ పనులు జరుగుతున్నందున రెండు రోజుల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ నాగేంద్ర, రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డ తెలిపారు. అబ్బిరెడ్డిపల్లె, వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు అంతరాయం ఉంటుందని వారు వివరించారు.